**పత్రికాప్రకటన** **కాకినాడ, మార్చి 4, 2018.**

దేశానికి అభివృద్ధి ఒక సూచికగా ఉంటుందని మన జిల్లా పరిశ్రమలపరంగా చాలా అభివృద్ధి చెందిందని, పరిశ్రమల భద్రతకు తగు చర్యలు చేపట్టి అందరికీ అవగాహన కల్పిస్తే మరింత ముందుకు సాగవచ్చని జాయింట్ కలక్టర్ ఎ.మల్లిఖార్జున పేర్కొన్నారు. ఆదివారంనాడు పరిశ్రమల శాఖ, అపోలో హెల్త్ భాగస్వామ్యంతో అపోలో ఆసుపత్రి నుండి జెఎన్‌టియు అలుమినీ సమావేశపు హాలు వరకు ఏర్పాటు చేసిన 47వ జాతీయ భద్రతా దినోత్సవ ర్యాలీని జేసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ పరిశ్రమల స్థాపన ద్వారా పెట్టుబడివస్తుందని తద్వారా జిల్లా అభివృద్ధి గణనీయంగా పెరుగుతుందన్నారు. కెమికల్ హజార్డు వస్తే మాక్ డ్రిల్ చేసి ప్రమాదానికి లోనైన వారిని రక్షించి సహకరించడానికి చర్యలు చేపడతారన్నారు. అన్ని పరిశ్రమల వారు అపోలో వారు ఏర్పాటు చేసిన మాక్ డ్రిల్‌ను చూడడంతో పాటు వారు పని చేసే చోట ప్రమాదాలు సంభవించినప్పుడు వీటిని ఉపయోగించి ప్రమాదంలో ఉన్న వారిని రక్షించాలన్నారు. విపత్తులు చెప్పిరావని, ఇళ్ళు కూలడం, అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు అక్కడ వారికి సహకరించాలన్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్‌సి చిక్కాల రామచంద్రరావు మాట్లాడుతూ సమాజం ముందుకు పోవాలంటే పరిశ్రమల స్థాపన ఎంతైనా అవసరమన్నారు. పరిశ్రమల్లో పని చేయడానికి కార్మికులు అవసరమని వారికి రక్షణకల్పించడానికి యాజమాన్యం చర్యలు చేపట్టాలన్నారు. కార్మికులు బాధ్యతతో వ్యవహరించాలని, భద్రతకు ప్రాధాన్యతనిచ్చి పని చేసినప్పుడే వారు వారి కుటుంబాలు క్షేమంగా వుంటాయన్నారు. భోపాల్ లో చిన్న తప్పిదం వల్ల పెను ప్రమాదం జరిగిందని, ఇప్పటికి ఆ ప్రాంతంలో 50-60 వేల మంది అనారోగ్యంతో బాధ పడుతున్నారని చెప్పారు. ఫ్యాక్టరీస్ భద్రత కొరకు బాద్యతతో వ్యవహరించాలని, కార్మికులకు సదుపాయాలు కల్పించాలని తెలిపారు. అనంతరం బుడగలు ఎగురవేసి వాక్‌థాన్ ప్రారంభించారు. తొలుత జాతీయ భద్రతా దినోత్సవం ప్రతిజ్ఞ చేసారు.

**అబ్బుర పర్చిన విన్యాసాలు :-**

ఎన్‌డిఆర్‌ఎఫ్ టీములు పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవించినప్పుడు బాధితులను రక్షించేందుకు చేపట్టే చర్యలను మాక్ డ్రిల్ ద్వారా ప్రదర్శించి, అతిధులను, కార్మికులను, విద్యార్థులను అబ్బురపర్చారు. పై అంతస్తుల్లో ప్రమాదం సంభవించినబప్పుడు, వారిని రక్షించి , క్రిందకు దించడం, పరిశ్రమల్లో రసాయనాలు, గ్యాస్ లీక్ మూలంగా ప్రమాదాలు సంభవించినప్పుడు రక్షణ కల్పించడం ప్రధమ చికిత్స చేసి, ఆసుపత్రికి తరలించడం తదితర విన్యాసాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. పరిశ్రమల్లోను, విపత్తులు సంభవించినప్పుడు బాధితులను రక్షించడానికి భద్రతా చర్యలు చేపట్టడం, సురక్షిత ప్రాంతాలకు తరలించడం కళ్ళకు కట్టినట్లు ఈ టీములు చూపించాయి.

ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ డైరెక్టర్ బాల కిషోర్ , డిప్యూటీ ఛీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఎంవి శివకుమార్ రెడ్డి, అపోలో సిఇఓ డా.సందీప్, గోదావరి ఇహెచ్ఎస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.జ్ఞాన సుందరం, ఎన్ఎఫ్‌సిఎల్‌అధినేత, జివిఎస్ఆనంద్‌తదితరులు పాల్గొన్నారు. తొలుత జెఎన్‌టియు లో పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవించినప్పుడు ఉపయోగించే పరికరాల ఎగ్జిబిషన్‌ను జేసి ప్రారంభించి పరిశీలించారు.

( సమాచార శాఖ చే జారీ )